క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహేశ్వరం: మండల పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. నాగారం, పెండ్యాల, అమీర్‌పేట్, కోళ్లపడకల్, ఘట్టుపల్లి గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు నిలిపివేస్తున్నామని ఏఈ చక్రపాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి స్టేషన్ తిమ్మాపూర్ 132 కేవీ రైల్వే స్టేషన్‌కి కొత్త లైన్లు వేయడానికి విద్యుత్ సరఫరాను నిలుపుతున్నట్లు ఆయన వివరించారు.

గెలుపోటములు సహజం

బీజేపీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మణ్

తుక్కుగూడ: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోనే తుక్కుగూడ మున్సిపాలిటీలో పార్టీ పటిష్టంగా ఉందన్నారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో ప్రతి బూత్‌లో బీజేపీ లీడ్ ఇచ్చిందన్నారు. ఎన్నికలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఐదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యారంటీలన్నీ అమలు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబుకు బొకే ఇచ్చి సత్కరిస్తున్న యోగేశ్వర్‌రెడ్డి

హస్తినాపురం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేస్తామని, ఆరు గ్యారంటీ హామీల్లో రెండింటిని ఇప్పటికే అమలు పరిచామని రాష్ట్ర ఐటీ, శాసన సభ వ్యవహారాల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హస్తినాపురానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యోగేశ్వర్‌రెడ్డి ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఎంతో నమ్మకంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి అధికారం అప్పగించారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి పరిపాలన అందిస్తామన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారని చెప్పారు.

సందడిగా బచ్‌పన్ ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వనస్థలిపురం: హిల్‌కాలనీలోని బచ్‌పన్ స్కూల్‌లో బచ్‌పన్ ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ సందడిగా సాగాయి. వనస్థలిపురం, కొత్తపేట, సరూర్‌నగర్, మన్సూరాబాద్ బచ్‌పన్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, విద్యాసంస్థ డైరెక్టర్ కె.రూపారెడ్డి, ప్రిన్సిపాళ్లు కల్పవల్లి, సునీతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఎల్‌బీనగర్: హయత్‌నగర్‌లోని సూర్యానగర్ కాలనీలో శ్రీసాయి తేజస్విని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజలు నుంచి విశేష స్పందన లభించింది. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో వచ్చి షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర వ్యాధులకు పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ గుత్తా శశిధర్‌రెడ్డి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు రాసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరం నిర్వాహకుడు జక్కి వీరస్వామి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉపకులాల అభ్యున్నతే ధ్యేయం

మలక్‌పేట: మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతే లక్ష్యంగా కృషి చేస్తామని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అన్నారు. పాపయ్య మాదిగ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మలకపేట నియోజకవర్గ నాయకులు ఆదివారం ఆయన్ను మూసారంబాగ్‌లో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నేతలు బట్టు దాసురావు, కొత్వాల్‌దార్ కృష్ణ, నాయకులు గంట సుదర్శన్, పోలేపాక వెంకన్న, దేవులపల్లి వెంకన్న, బకరం యాదగిరి ఉన్నారు.

చలి వేళ.. గిరాకీ భళా



ఎర్రకుంటలో స్వెట్టర్ల విక్రయ కేంద్రం

- జోరుగా స్వెట్టర్ల విక్రయాలు
- జల్‌పల్లి పరిధిలో వెలిసిన దుకాణాలు

పహాడీషరీఫ్: చలి పులి పంజా విసురుతుండడంతో నగర శివారు ప్రజలు వణికిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికమై కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. స్వెట్టర్లు ధరించకుండా తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో స్వెట్టర్లు, దుప్పట్లకు భలే గిరాకీ ఏర్పడింది. మధ్యప్రదేశ్, పంజాబ్ నుంచి వీటిని కొనుగోలు చేసి వ్యాపారులు జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట, షాహీన్‌నగర్, పహాడీషరీఫ్ ప్రధాన రహదారులపై గూడారాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. పాత స్వెట్టర్లు ఉన్నప్పటికీ అవి చలిని తట్టుకోలేవని చాలా మంది కొత్త వాటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.400 నుంచి మొదలుకొని రూ.1000 వరకు ఈ స్వెట్టర్ల ధరలు ఉన్నాయి. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన స్వెట్టర్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దుప్పట్ల ధరలు కూడా రూ.300 నుంచి రూ.600 వరకు పలుకుతున్నాయి. ఉదయం వేళల్లో పారిశుద్ధ్య కార్మికులు చలి తీవ్రతకు రహదారుల వెంబడి మంటలు కాసుకుంటున్నారు.

అందుబాటులోకి కొత్త డిజైన్లు..

చలి ఉంటున్నప్పటికీ తప్పనిసరి బయటికి వెళ్లాల్సిన వారి కోసం కొత్త డిజైన్ల స్వెటర్లు అందుబాటులోకి వచ్చాయి. మంకీ క్యాప్‌లు, కేవలం చెవులకు మాత్రమే సరిపోయేలా మఫ్లర్‌లు కొత్తవి రూపొందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా నిద్రపోయేలా దుప్పట్లు, రగ్గులు కూడా అందుబాటులో ఉన్నాయి. డిసెంబర్, జనవరి మాసాలలో చలి పులి మరింత పంజా విసరనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటిల్లిపాది కోసం వీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఆరు నెలల పాటు అమ్మకాలు..

మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు చెందిన వ్యాపారులు ఈ స్వెటర్లను విక్రయిస్తుంటారు. ప్రధాన రహదారుల పక్కన గూడారాలు ఏర్పాటు చేసుకొని ఏడాదిలో ఆరు నెలల పాటు విక్రయాలు కొనసాగిస్తుంటారు. వర్షాకాలం ఆరంభంలో వీటి అమ్మకాలు ప్రారంభమయి చలికాలం ముగిసేంత వరకు కొనసాగిస్తారు. వర్షాకాలంలో రెయిన్ కోట్‌లను విక్రయిస్తున్న వ్యాపారులు, శీతాకాలంలో స్వెట్టర్లను అమ్ముతున్నారు.

సామాన్యులకు అందుబాటులో..



గతేడాది కంటే ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజల నుంచి డిమాండ్ పెద్ద స్థాయిలో ఉంది. తమ వద్ద ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే కొనుగోలు చేస్తుండడాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరలకే విక్రయిస్తున్నాం. చలి నుంచి ఉపశమనం పొందేలా ఈ ఏడాది మార్కెట్‌లోకి ఢిల్లీ, లుధియానా నుంచి అధునాతన స్వెట్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం.

– మహ్మద్ అలీ, వ్యాపారి

గజగజ వణుకుతూ..



నవంబర్ మాసం నుంచే చలి గజగజ వణికిస్తుంది. ఇంతటి చలి పులి నుంచి తట్టుకోవాలంటే స్వెట్టర్లు తప్పనిసరి వాడాల్సి వస్తుంది. గతంలో వీటిని కొనుగోలు చేయాలంటే కోఠి వెళ్లాల్సి వచ్చేది. కానీ గత మూడేళ్లుగా ఎర్రకుంట, పహాడీషరీఫ్, తుక్కుగూడ, కాటేదాన్ ప్రధాన రహదారులపై గూడారాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఇదే సీజన్‌గా భావించి ఎక్కువ ధరలు విక్రయించకుండా ధరలు మరింత తగ్గిస్తే బాగుటుంది.

– ఉస్మాన్, ఎర్రకుంట

సబితారెడ్డికి అభినందనల వెల్లువ



పహాడీషరీఫ్: సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కొండల్‌యాదవ్ తదితరులు

పహాడీషరీఫ్: మహేశ్వరం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సబితారెడ్డికి పహాడీషరీఫ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పందెం కొండల్ యాదవ్ ఆధ్వర్యంలో సూర్యకుమార్ గౌడ్, మహ్మదీయ కాలనీ అధ్యక్షుడు హమీద్ ఖాన్, ఖదీర్, సతీష్ కుమార్, విశాల్ గౌడ్, మినాజ్, అమీర్, ఇమ్రాన్‌లు ఆదివారం ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన సబితారెడ్డిని ఆదివారం సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మొహమ్మద్ జహీర్, ఇస్మాయిల్, సాదిక్, రజాక్, ఇర్ఫాన్, అఫ్రోజ్ పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: ఎమ్మెల్యేని కలిసిన మైనార్టీ నాయకులు

సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



నేదునూరులో జెండా ఊపి ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

కందుకూరు: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి అందరూ రుణపడి ఉంటామని వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్ కొనియాడారు. ఆదివారం మండలంలోని నేదునూరులో మహిళలు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను కేవలం రెండు రోజుల్లోనే సీఎం అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. అందరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, బలవంత్‌రెడ్డి, శ్రీశైలం, అమీన్‌బేగ్, సురేష్, సంజీవ, పెంటయ్య, ఎండీ పాషా, జగన్, ఎండీ ఖాజా, శ్రీరాములు, జంగయ్య, షోయబ్‌బేగ్, భాస్కర్‌రెడ్డి, రమేష్, మహేందర్, దర్శన్, సుధాకర్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోవాలి



మహేశ్వరంలో మహిళలతో కలిసి ప్రయాణం చేస్తున్న పారిజాతరెడ్డి



మహేశ్వరం: బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలవుతాయి
- మేయర్ చిగురింత పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, పీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ఆమె ప్రారంభించి స్థానిక మహిళలతో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ఇచ్చిన ప్రతి హామీలను ప్రభుత్వం అమలు చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మోహన్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, కందుకూరు ఎంపీపీ జ్యోతి, వైస్‌ఎంపీపీ శమంత, తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ మధుమోహన్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు నారాయణ, రాజు, రాజునాయక్, నర్సింహా, బాల్‌రాజ్, అంజయ్య, కృష్ణ నాయక్, పాండు నాయక్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పీచర్ల వెంకటేశ్వర్లుకు నివాళి

చైతన్యపురి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, టీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడు పీచర్ల వెంకటేశ్వర్‌రావుకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. పీ అండ్ టీ కాలనీ కమ్యూనిటీ హాల్ జరిగిన పీచర్ల సంతాప సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ టీఆర్‌ఎస్ మాజీ ఇన్‌చార్జి కాచం సత్యనారాయణ , మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు రూబీ స్టీఫెన్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీకమాస పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో శివపార్వతులు

మీర్‌పేట: మీర్‌పేట శ్రీ గాయత్రి సేవా సంఘం ఆధ్వర్యంలో 23వ కార్తీకమాస విశేష పూజలను ఆదివారం ఆర్‌సీఐ రోడ్డులోని కొండానగర్‌హిల్స్ కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శుద్ధపల్లి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ.. లోక కల్యాణార్థం ఉదయం 7 గంటల నుంచే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, గోపూజ, కుంకుమార్చన, మహాలింగార్చన, చండీహోమం, పార్వతీపరమేశ్వర దివ్యలీలా కల్యాణంతో పాటు వనభోజనాలు నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎన్జీఓస్ కాలనీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: తెలంగాణలో నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన నేపథ్యంలో ఆదివారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సదరు పథకాన్ని ప్రారంభించారు. అలాగే ఎన్జీఓస్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిప్రియ, నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న బృందావన్ మిడోస్ కాలనీవాసులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని బృందావన్ మిడోస్ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన బృందావన్ మిడోస్ కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కాలనీ అధ్యక్షుడు శశికాంత్, ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌చారి, రాజు, వేణు, శివ, గోపాలకృష్ణ, ప్రభాకర్, రమణ, సురేష్, రఘుమారెడ్డి, రాఘవేందర్ పాల్గొన్నారు.

దుర్గంధం.. దోమలమయం

- కబ్జాలతో కుంచించుకుపోయి మురుగు కూపంగా బైరామల్‌గూడ చెరువు
- పూర్తికాని సుందరీకరణ పనులు
- బిల్లు మంజూరు కాక మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- వ్యాధుల బారిన పరిసర కాలనీవాసులు



మురుగునీటి కాసారంగా మారిన బైరామల్‌గూడ చెరువు

చంపాపేట: ప్రజల నీటి అవసరాలను తీర్చాల్సిన చెరువులు ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదు. కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమై సెప్టిక్ ట్యాంక్‌ల్లా మారి పరిసర కాలనీవాసులకు అనారోగ్యాన్ని పంచుతున్నాయి. ఇందుకు కర్మన్‌ఘాట్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు నిదర్శనంగా నిలుస్తోంది.

- ఒకప్పటి కర్మన్‌ఘాట్ గ్రామపంచాయతీ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు 6 ఎకరాల విస్తీర్ణంతో మంచినీటితో తొణికిసలాడేది. మారుతున్న కాలానికి అనుగుణంగా నగర జనాభా, నగర విస్తీర్ణత పెరగడంతో ఆ చెరువు పరిసరాలు కాస్తా కాంక్రీట్ జంగిల్‌గా మారాయి.
- దీంతో బీఎన్‌రెడ్డి, డిఫెన్స్, మాధవనగర్ వంటి ఎగువ ప్రాంతాల మీదుగా వరదనీటిని చెరువుకు మోసుకొచ్చే డొంకలు, వాగులు, పిల్ల కాలువలు కాస్తా కనుమరుగయ్యాయి. దీంతో చెరువుకు నీరు వచ్చే మార్గం లేక ఎండి బీడుబారిపోయింది.
- బీడువారిన చెరువు స్థలాన్ని కొందరు కబ్జా చేయడంతో కుంచించుకుపోయి ఆరు ఎకరాల చెరువు కాస్తా 2 ఎకరాల మురుగునీటి కుంటగా మారింది.

నత్తనడకన సుందరీకరణ పనులు

- బైరామల్‌గూడ చెరువు సుందరీకరణకు ఆరేళ్ల క్రితమే ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు మాత్రం నత్తనడకన సాగుతుండటంతో సమస్య ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.
- కాంట్రాక్టర్ మురుగు, వరదనీరు చెరువులోకి చేరకుండా సరూర్‌నగర్ చెరువు వరకు ట్రంక్ లైన్ పనులు ప్రారంభించాడు. అనంతరం చెరువులో పూడికతీత పనులు ప్రారంభించాడు. బిల్లులు విడుదల కాకపోవటంతో ఎక్కడి పనులు అక్కడే వదిలేసి చేతులు దులుపుకున్నాడు.
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, స్థానిక కాలనీవాసుల ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్ ఏడాదిన్నర క్రితం చెరువు చుట్టూ కట్టలా మట్టి పోసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మళ్లీ చేతులు ఎత్తేశాడు.
- పరిసర కాలనీవాసులు అండర్ డ్రైనేజీ నాలాలను కుంటగా మారిన చెరువు స్థలంలో వదిలివేయడమే కాకుండా మాంసం వ్యర్థాలు, చెత్తాచెదారం ఆ ప్రాంతంలో డంపింగ్ చేయడంతో చెరువు మురుగు కూపంగా మారింది.
- ఫలితంగా పరిసర కాలనీవాసులు పందులు, దోమల స్వైర విహారం, ముక్కుపుటాలదిరే దుర్గంధం కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు.
- ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సర్కిల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని చెరువు స్థలాన్ని సంరక్షించి పూర్తి స్థాయిలో సుందరీకరించాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

విముక్తి కల్పించాలి



బైరామల్‌గూడ చెరువు మురుగు నీటి కాసారంగా మారింది. నిత్యం వెదజల్లే దుర్గంధం, దోమల సమస్యల మధ్య జీవించాల్సి వస్తోంది. అనారోగ్యం పాలవుతామని ఆందోళన చెందుతున్నాం. వెంటనే సుందరీకరణ పనులు చేపట్టి చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి.

గోపాల్ ముదిరాజు, మాధవనగర్

చెరువు ఆక్రమిత స్థలాన్ని స్వాధీన పరచుకోవాలి



గతంలో చెరువు సుమారు ఆరు ఎకరాల వరకు ఉండేది. కాలక్రమంలో ఆక్రమణలకు గురై రెండు ఎకరాలు మిగిలి మురుగు నీటి కుంటగా మారింది. ఆక్రమణదారులపై వేటువేసి చెరువు స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని చెరువును సుందరీకరించాలి.

– ఖాదర్, చంపాపేట

మినీ ట్యాంక్ బండ్‌లా తీర్చిదిద్దాలి



రాత్రి, ఉదయం వేళల్లో పరిసర కాలనీవాసులు చెరువు ఖాళీ స్థలాన్ని చెత్త డంపింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. చెరువుకు అవుట్‌లెట్ ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాకు గురైన చెరువు భూమిని స్వాధీనం చేసుకొని మినీ ట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దాలి.

ఎరవెల్లి శివకుమార్‌చారి, కటకోనికుంట